క్లుప్తంగా

నేడు అంగన్‌వాడీల చలో హైదరాబాద్



సీడీపీఓ శాంతిశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీలు

ఇబ్రహీంపట్నం: జీవో నెంబర్ 10ని రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం సీడీపీఓ శాంతిశ్రీకి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎల్లేష్, బుగ్గరాములు, చందునాయక్, అంగన్‌వాడీలు బాలమణి, పెంటమ్మలు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా లక్ష్మీపతిగౌడ్



లక్ష్మీపతిగౌడ్

ఇబ్రహీంపట్నం రూరల్: ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పండాల లక్ష్మీపతిగౌడ్‌ను నియమించారు. ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గండమల్ల ఆనంద్‌గౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడులు నర్సింహారెడ్డి నియామక పత్రం గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పండాల లక్ష్మీపతిగౌడ్ మాట్లాడుతూ ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్ నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం సంతోషమన్నారు. బీజేపీలో కష్టపడి పని చేయడం వల్లే ఈ అవకాశం దక్కిందన్నారు. ఈ బాధ్యత అప్పగించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



హైమద్‌కు సాయం చేస్తున్న స్నేహితులు

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌కు చెందిన హైమద్ 20 రోజులుగా బ్రెయిన్ స్ట్రోక్, నరాల బలహీనతతో బాధపడుతూ నల్గొండ జిల్లాలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. చుక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002–2003 (బ్యాచ్) పదోతరగతి చదివిన తోటి స్నేహితులు మేమున్నామంటూ ముందుకు వచ్చారు. హైమద్ వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం నల్గొండకు వెళ్లి రూ.52,000 సాయం చేశారు. ఈ కార్యక్రమంలో రాజు, స్నేహితులు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు మొక్కలు అవసరం

ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్



బద్‌నాపూర్‌లో చెట్లు నాటుతున్న సీఐ బద్యానాద్‌చౌహాన్

ఆమనగల్లు: మానవాళి మనుగడకు మొక్కలను తప్పకుండా పెంచాలని ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ పేర్కొన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 20వేల ఈత, తాటి, ఖర్జూర చెట్లు నాటడమే లక్ష్యమన్నారు. తలకొండపల్లి మండలం బద్‌నాపూర్ గ్రామంలో రైతులు కృష్ణగౌడ్, శివకుమార్‌గౌడ్‌ల పొలాల్లో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వెయ్యి ఈత చెట్లు నాటారు. ఈ సందర్భంగా బద్యానాద్ చౌహాన్ మాట్లాడుతూ ఆమనగల్లు ఎక్సైజ్ శాఖ పరిధిలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల్లో ఈత, తాటి, ఖర్జూర చెట్లను నాటుతున్నట్లు చెప్పారు. భావితరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అరుణ్ కుమార్, సిబ్బంది శంకర్, బాబు, లోక్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ఎమ్మెల్యేలకు సన్మానం

ఇబ్రహీంపట్నం: మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిలకు ఇబ్రహీంపట్నంలోని వైష్ణవి గార్డెన్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు అంకిత్ హాస్పిటల్ ఎండీ ప్రకాశ్ తెలిపారు. ఈ ప్రాంత ప్రజలతో ఒక వైద్యుడిగా సుమారు 30 సంవత్సరాల అనుబంధం కలిగియున్న డాక్టర్ సత్యనారాయణ కరీంనగర్ జిల్లా మానకొండూరు ఎమ్మెల్యేగా గెలుపొంది తొలిసారిగా ఇబ్రహీంపట్నంకు విచ్చేస్తున్నందునా ఆత్మీయ స్వాగత సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, స్నేహితులు హాజరుకావాలని కోరారు.

రుణమాఫీతో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

నియోజకవర్గంలోని ఆయా మండల కేంద్రాల్లో పీఏసీఎస్ ఛైర్మన్లు కాంగ్రెస్ నాయకులు, రైతులు, రైతుసంఘం నాయకుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేసినందుకు గురువారం ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఆమనగల్లు పట్టణంలో మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసేవిధంగా తగిన చర్యలు తీసుకున్నారన్నారు.



ఇబ్రహీంపట్నం: క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఆమనగల్లులో సీఎం రేవంత్ సందేశాన్ని వింటున్న అధికారులు, నాయకులు



మంచాల: సంబరాలు చేసుకుంటున కాంగ్రెస్ నాయకులు



కడ్తాల్: సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



తలకొండపల్లి: వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన నాయకులు



యాచారం: వీడియో కాన్ఫరెన్స్‌లో పద్మజారమణి



మాడ్గుల: క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఆమనగల్లు: బైక్ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు



తలకొండపల్లి: సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం



కడ్తాల్: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

ఆశ వర్కర్ల నూతన కార్యవర్గం ఎంపిక



గట్టుఇప్పలపల్లి నూతన కార్యవర్గం

తలకొండపల్లి: తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఆశ వర్కర్లు గురువారం సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా సుజాత, ఉపాధ్యక్షురాలిగా జయమ్మ, చంద్రకళ, జంగమ్మ, సునీత, ప్రధాన కార్యదర్శిగా విమల, కోశాధికారిగా కవిత, సహాయ కార్యదర్శిగా అనురాధలతో పాటు, మరో 15 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



పోలీసుల అదుపులో నిందితులు

మాడ్గుల: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మాడ్గుల సీఐ నాగరాజ గౌడ్ తెలిపారు. గురువారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా ఇరివ్వెన్ వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ మదాసు అనీల్, యజమాని బాతుక కొండల్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు



ఇబ్రహీంపట్నం: నిరసన వ్యక్తం చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు



ఆమనగల్లు: దీక్షలో మధ్యాహ్న భోజన కార్మికులు

ఇబ్రహీంపట్నం: సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం కూడా దీక్షలు కొనసాగించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మార్తమ్మ, నిర్మల, పుష్ప, ప్రేమలత, పద్మ, బాలమ్మ, జయమ్మ, రామలమ్మలు పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. గురువారం స్థానిక పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 నెలలుగా తమకు జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు పద్మ, సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య, గోజీ, యాదమ్మ, కవిత, తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాల్గో రోజు కూడా చేశారు.మండల కేంద్రంలోని వివేకానంద విగ్రహం వద్ద బైఠాయించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య మాట్లాడారు.

మంచాలలో..

మంచాల: మంచాల మండల కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినదించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జంగమ్మ, అలివేలు, లక్ష్మమ్మ, పద్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

సీఐ శివప్రసాద్



మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

కడ్తాల్: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సీఐ శివప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నైతిక విలువలు, కుటుంబ బాధ్యత, క్రమశిక్షణ, టెక్నాలజీ తదితర అంశాలపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి సీఐ శివప్రసాద్ మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. డ్రగ్స్‌కు బానిసలు కావడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, అనేక కుటుంబాల జీవితాలు దుర్భరంగా తయారవుతున్నాయన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లను పరిమితికి మించి వాడటం తగదని, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తతో ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ తల్లిదండ్రుల కలలు సాకారం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రవి, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహం



బహుమతులు ప్రదానం చేసిన జిల్లా క్లాస్‌మెట్‌క్లబ్, వాసవీ ఎడ్యుకేషన్ ట్రస్టు సభ్యులు

ఆమనగల్లు: ప్రతిభ కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తామని జిల్లా క్లాస్‌మెట్ క్లబ్ అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం క్లాస్‌మెట్ క్లబ్, వాసవీ ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీలో ప్రతిభ చూపిన 8 మంది విద్యార్థులకు రూ.1,016నగదు బహుమతి, మెడల్స్‌ను ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తాము అండగా ఉంటామన్నారు. ప్రతీ ఏడాది ఎస్ఎస్‌సీలో ప్రతిభ చూపిస్తున్న విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వాసవీ ఎడ్యుకేషన్ ట్రస్టు కార్యదర్శి వీరబొమ్మ రామ్మోహన్, సభ్యులు డాక్టర్ బికుమాండ్ల శ్రీనివాస్, జిల్లా క్లాస్‌మెట్ క్లబ్ కార్యదర్శి అలంపల్లి రమేశ్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాండు, దూసకంటి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం మనదే

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: ఉప్పరిగూడ రైతువేదిక వద్ద వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: పంద్రాగస్టు లోపు రుణమాఫీ చేసితీరుతామని ఇచ్చిన మాట నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా రుణమాఫీ అమలు చేసిన సందర్భంగా సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గం ఎమ్మెల్యేలతో రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పరిగూడ గ్రామంలోని రైతు వేదికలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ హాజరయ్యారు. ఆర్డీఓ అనంతరెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ స్రవంతి, ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ మంగ, మాజీ జెడ్పీటీసీ మహిపాల్, గురునాథ్‌రెడ్డి, రాచర్ల వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సునీతా, వ్యవసాయ శాఖ ఏడీ వరప్రసాద్‌రెడ్డి, ఏఈఓలు రఘు, శ్రవణ్‌కుమార్, ఎంపీడీఓ వెంకటమ్మ పాల్గొన్నారు.

ఆమనగల్లులో..

ఆమనగల్లు: మండలంలో 1,900 మంది రైతులకు రూ. 11.23 కోట్లు రుణమాఫీ జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యక్ష కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని రైతులు తిలకించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, ఏఈఓలు రాణి, శివతేజ, సాయిరాం, మాజీ వైస్ ఎంపీపీలు జక్కు అనంతరెడ్డి, నిట్టె నారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పులమానయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మమాట-అంగన్‌వాడీ బాట



అక్షరాభ్యాసం చేయిస్తున్న సీడీపీఓ శాంతిశ్రీ, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి తదితరులు




కడ్తాల్: ముద్విన్‌లో చిన్నారులతో అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు

యాచారం: మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో గురువారం అమ్మమాట- అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ శాంతిశ్రీ,, యాచారం ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణులకు, కిశోర బాలికలకు, చిన్నారులకు పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. టీచర్లు సునీత, కిష్టమ్మ, ఆశ కార్యకర్తలు పద్మ, శ్యామలమ్మ, పాల్గొన్నారు.

నిరుపయోగంగా బస్సు షెల్టర్!



ఆరుట్లలోని వేంకటేశ్వర కాలనీలో నిరుపయోగంగా మారిన బస్‌షెల్టర్

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు

మంచాల: బస్సు షెల్టర్లలో బస్సులు ఆగక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. మంచాల మండల పరిధిలోని ఆరుట్ల గ్రామం మేజరు గ్రామ పంచాయతీ. ఇక్కడ వేంకటేశ్వర కాలనీ నుంచి కచ్చీర్ వరకు బస్సు కోసం వెళ్లాలంటే కిలో మీటరు దూరం ఉంటుంది. ఇక్కడి నుంచి నిత్యం వందలాది మంది బస్సులో ప్రయాణం చేస్తున్నారు. వేంకటేశ్వర కాలనీలో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఇబ్బంది తప్పడమే గాకుండా బస్సుల రాక పోకలకు ఎలాంటి ఆటంకం ఎదురుకాలేదు. ఈ విషయంలో స్థానిక ప్రజా ప్రతినిధులు గ్రామ పంచాయతీ తీర్మాణం కూడా చేశారు. ఆరుట్ల గ్రామానికి వచ్చే ప్రతి ఆర్టీసీ బస్సు వేంకటేశ్వర కాలనీలోని బస్‌స్టాప్ వద్దకు వచ్చి పోవాలని తీర్మాణం చేశారు. ఆర్టీసీ అధికారులకు కూడా విజ్ఞప్తి చేశారు. రెండు, మూడు రోజుల వరకూ వేంకటేశ్వర కాలనీ వద్దకు బస్సులు వచ్చి పోయేవి. కానీ మధ్యలోనే బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ ప్రాంతంలో బస్సు రాకపోవడంతో ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారింది. నిత్యం ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటూ బస్సు కోసం కిలో మీటరు దూరంలోని కచ్చీర్ వద్దకు వెళ్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని వేంకటేశ్వర కాలనీ వరకు ఆర్టీసీ బస్సులు నడిపించాలని ప్రజలు కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పీఆర్టీయూ సభ్యత్వ నమోదులో జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్



పీఆర్టీయూ సభ్యత్వాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పీఆర్టీయూ కృషిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె. గోవర్ధన్‌యాదవ్ తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ వారోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఆర్టీయూను మరింత బలోపేతం చేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఉపాధ్యాయులంతా ఏకధాటిపై నిలబడితే ప్రభుత్వమే దిగివస్తుందన్నారు. కరువు భత్యం ప్రకటించాలని, జీవో నెంబర్ 11, 12ను సవరించి బీఈడీ అర్హత గల ఉపాధ్యాయులకు పీఎస్‌హెచ్ఎం పోస్టులు కల్పించాలని, జిల్లాలోని అదనపు క్యాడర్ స్ట్రెంత్ విషయంపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు సభ్యత్వాలను గోవర్ధన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు రాజు, జమీర్ , మురారి, చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.